

ఢిల్లీలో ఎంపీ సురేశ్‌రెడ్డితో జిల్లా రైతులు

## ఎంపీ సురేశ్‌రెడ్డికి జిల్లా రైతుల కృతజ్ఞతలు

మోర్తాడ్, డిసెంబర్ 1 : నిజామాబాద్ జిల్లాలో పసుపుబోర్డు ఏర్పాటుచేయాలని రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి ప్రైవేటు బిల్లును ప్రవేశపెట్టిన సందర్భంగా ఢిల్లీలో ఆయనను జిల్లా రైతులు ఆదివారం కలిసి కృతజ్ఞతలు చెప్పారు. జిల్లా ఎంపీ అర్వింద్ పసుపుబోర్డు ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడం, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు హామీలు ఇచ్చిన నేపథ్యంలో జిల్లా రైతులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. అయితే పసుపు బోర్డు ఏర్పాటు విషయంలో ఎంపీ కవిత ఎన్నో సార్లు విన్నవించారు. అయినా పసుపుబోర్డు మంజూరు కాకపోవడం రైతుల్లో తీవ్ర అసంతృప్తిని మిగిల్చింది. తాజాగా ఎంపీ సురేశ్‌రెడ్డి ప్రైవేటు బిల్లును ప్రవేశపెట్టడంతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతున్నది.

## రైతుభరోసా వెంటనే ఇవ్వాలి

- పోసానిపేట్ గ్రామ రైతుల డిమాండ్
- కొనుగోలు కేంద్రం వద్ద నిరసన



పోసానిపేట్ కొనుగోలు కేంద్రం వద్ద నిరసన వ్యక్తంచేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

రామారెడ్డి, డిసెంబర్ 1: రైతు భరోసా వెంటనే ఇవ్వాలని మండలంలోని పోసానిపేట్ గ్రామ రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామంలోని కొనుగోలు కేంద్రం వద్ద మాజీ ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆదివారం నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రైతు సంబురాలు చేసుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డికి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు గుర్తుకురావడంలేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా ఇచ్చిన హామీలను అమలుచేయడంలేదని మండిపడ్డారు. ఇప్పటికే రెండు సీజన్లు ముగిసి మూడో పంటకు సిద్ధమవుతున్నా రైతుభరోసా జాడలేదన్నారు. సన్న వడ్లకు మాత్రమే కాకుండా అన్ని వడ్లకూ బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

## మఫ్టీలో పోలీసుల స్పెషల్ డ్రైవ్

- రాత్రి 10.30 గంటల తర్వాత తెరిచి ఉన్న దుకాణాలు
- 11 మంది వ్యాపారులపై కేసు నమోదు

వినాయక్‌నగర్, డిసెంబర్ 1: జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రాత్రి 10.30 గంటల తర్వాత కూడా హోటళ్లు, టీస్టాళ్లు, పాన్ షాపులు తెరిచి ఉంచుతున్నారనే సమాచారం మేరకు ఏసీపీ మఫ్టీలో పెట్రోలింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా నగరంలోని వన్‌టౌన్, టూటౌన్, ఆరో టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో నిబంధనలు పాటించకుండా తెరిచి ఉంచిన దుకాణాలపై కొరఢా ఝుళిపించారు. ఏసీపీ దగ్గరుండి తెరిచి ఉన్న వ్యాపార సంస్థలను వీడియో, ఫొటోలు తీయించారు. మొత్తం 11 మందిపై సిటీ పోలీస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేయించారు. నగరంలోని బోధన్ రోడ్డు, ఖిల్లారోడ్డు, రైల్వే స్టేషన్, బస్టాండ్, నెహ్రూపార్కు ప్రాంతాల్లో నిబంధనలు ఉల్లంఘించి వ్యాపారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకున్నట్లు ఏసీపీ వెల్లడించారు. సూచించిన సమయం దాటిన తర్వాత వ్యాపారాలు కొనసాగిస్తే వారి పై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



ఉమ్మడి నిజామాబాద్ జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, కామారెడ్డి జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ ఆదివారం ఎమ్మెల్సీ కవితను మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆమె నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

– నిజాంసాగర్, డిసెంబర్ 1

## మూసేసినా.. ఆగని అక్రమ రవాణా

- రెచ్చిపోతున్న అక్రమార్కులు
- మంజీరా పరీవాహక ప్రాంతంలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు
- పేరుకు టీజీఎండీసీ క్వారీల మూసివేత..
- రాత్రయితే చాలు ఎత్తివేత
- అధికార పార్టీ ప్రజాప్రతినిధుల అనుచరుల దందా.
- పట్టించుకోని రెవెన్యూ, పోలీసు అధికారులు

ఉమ్మడి జిల్లాలోని మంజీరా పరీవాహక ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా ఆగడంలేదు. బరితెగించిన ఇసుకాసురులు యథేచ్ఛగా తవ్వకాలు చేపడుతున్నారు. మంజీరా పరీవాహక ప్రాంతంలో అధికారిక ఇసుక క్వారీలను మూసివేశారు. జ్యుడీషియల్ విచారణలో భాగంగా టీజీఎండీసీ ఆధ్వర్యంలో నడిచే క్వారీలను బంద్ పెట్టారు. కొన్నాళ్ల పాటు ఇసుక తవ్వకాలను బంద్ చేసినట్లు చూపినా.. స్థానికంగా జోరుగా ఇసుక రవాణా జరుగుతున్నది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇంతవరకు అధికారికంగా ఇసుక తవ్వకాలు చేపట్టలేదు. ఇసుక క్వారీలకు అనుమతులు మంజూరు చేయలేదు. ఉన్న అనుమతులు రద్దు చేసి జీరో దందాకు తెర లేపింది. పారదర్శకత పేరుతో విచారణ కొనసాగుతున్నప్పటికీ అక్రమాలకు మాత్రం అడ్డూ అదుపు లేకుండా పోతున్నది.

– నిజామాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)




కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని మంజీరా నది పరీవాహక ప్రాంతాల్లో పేరుకు పోయిన ఇసుకను అక్రమార్కులు యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. ఇందుకు స్థానిక ప్రజాప్రతినిధులు బహిరంగంగానే సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కామారెడ్డి జిల్లా జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల్లో స్థానిక కీలక నేతల అండదండలతో బిచ్కుంద, బీర్కూర్ మండలాల్లో ఇసుక తవ్వకాలు జోరుగా కొనసాగుతున్నాయి. నిజామాబాద్ జిల్లాలోనూ బాన్సువాడ నియోజకవర్గం పోతంగల్ మండలంలోని మంజీరా పరీవాహకంలో అక్రమంగా ఇసుకను తోడేస్తున్నారు.

### పోలీసు, రెవెన్యూ యంత్రాంగం ఉదాసీనత

పోలీసులకు, రెవెన్యూ అధికారులకు మామూళ్ల ఆశ చూపి అక్రమార్కులు ఇదంతా చేస్తున్నారన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. అడ్డు వచ్చిన గ్రామస్తులపై బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఇసుక అక్రమ రవాణాకు నియోజకవర్గాల్లో కీలక నేతల అండదండలు పుష్కలంగా ఉన్నాయి. గత ఎన్నికల్లో సహకరించిన తమ అనుచరులకు మేలు చేసేందుకు మద్దతుగా నిలిచి ఇసుక దందాను ప్రోత్సహిస్తున్నట్లు సమాచారం. అడ్డు వచ్చే పోలీసులకు ఆమ్యామ్యాలను ముట్టజెప్పి పక్కకు తప్పిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాత్రుల్లో ట్రాక్టర్లు, టిప్పర్ల రాకపోకలు సాగిస్తున్నా.. పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. మామూళ్లు ఇవ్వని లారీలు, ట్రాక్టర్లను స్టేషన్లకు తరలించి చిన్నపాటి కేసులతో మమ అనిపిస్తున్నారు. యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నప్పటికీ పోలీస్ ఉన్నతాధికారులు సైతం మిన్నకుండి పోతుండడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఎస్సై, సీఐ స్థాయి అధికారులైతే మంజీరా నది పరీవాహకంలో బరితెగించి ప్రవర్తిస్తున్నట్లుగా సమాచారం. మంజీరా ఇసుక రవాణాను నియంత్రించేందుకు కొద్ది రోజుల క్రితం వీఆర్ఏలను తనిఖీలకు నియమించగా అక్రమార్కుల బెదిరింపులకు భయపడి వారంతా ఆఫీస్ డ్యూటీలకే పరిమితమవుతున్నారు. రెవెన్యూ అధికారులకు ఇదంతా తెలిసినప్పటికీ ఏమీ చేయలేక చేతులు ఎత్తేస్తున్నారు. పెద్దల 'హస్తం' ఉండగా తామేం చేయగలమంటూ రెవెన్యూ ఉన్నతాధికారులు సైతం చేతులు ఎత్తేసినట్లుగా ప్రచారం జరుగుతున్నది. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోకుండా నేతలతో అంటకాగి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడంలో పోలీస్ శాఖ నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నది.

### చీకటి పడితే చాలు...

అనధికారికంగా ఇసుక రవాణాతో పెద్దమొత్తంలో ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లుతున్నది. అధికారిక క్వారీల్లో ఇసుక తవ్వకాలు చేపట్టాలంటే సీనరేజీ చార్జీల పేరుతో ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. ఇప్పుడు ఇదంతా బంద్ కావడంతో అంతా అనధికారికంగానే కొనసాగడం గమనార్హం. చీకటి పడితేచాలు అక్రమార్కులకు పండుగలా మారిందని పరీవాహక ప్రాంత ప్రజలు చెబుతున్నారు. ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించి లారీల్లోకి ఎక్కించి వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం. మహారాష్ట్ర, కర్ణాటక, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు తరలించి అందినకాడికి జేబులు నింపుకొంటున్నారు. బిచ్కుంద మండలంలోని హస్గుల్, షెట్లూర్, ఖత్‌గావ్, పుల్కల్ గ్రామ శివారుల్లోని మంజీరా పరీవాహక ప్రాంతాల నుంచి పదుల సంఖ్యలో ట్రాక్టర్లు నడుస్తున్నాయి. గ్రామస్తుల పేరిట తెరవెనుక బడా వ్యాపారులు రంగంలోకి దిగి ఇదంతా చేస్తున్నారని తెలుస్తోంది. పేరుకు స్థానిక అవసరాలు, గ్రామస్తులను ముందుకుతోసి వ్యాపారులు పెద్దమొత్తంలో దండుకుంటున్నట్లు ప్రచారం జరుగుతున్నది. మద్నూర్ మండలం సుల్తాన్‌పేట్, రుషేగావ్ శివారుల్లో ఇసుకను డంప్ చేసి అక్కడి నుంచి మహారాష్ట్ర, కర్ణాటకకు రాత్రివేళ టిప్పర్ల ద్వారా తరలిస్తున్నట్లుగా తెలుస్తున్నది. పరీవాహక ప్రాంతాల్లో ఒక్కో గ్రామంలో 50 వరకు ట్రాక్టర్లు ఉన్నట్లు అంచనా. వాటి ద్వారా ఇసుకను సులువుగా నదీ మార్గాన్ని దాటించి ఇతర రాష్ట్రాలకు గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్నారు.



బోధన్ పోలీస్‌స్టేషన్‌లో అక్రమంగా ఇసుక తరలించిన వాహనాలు (ఫైల్)

> **మంజీరాలో క్వారీలు తెరువలేదు...**
> కామారెడ్డి జిల్లాలోని మంజీరా పరీవాహక ప్రాంతంలో ఎలాంటి క్వారీలకు అనుమతి లేదు. ఇసుక తరలింపు కోసం ఎవరికీ పర్మిషన్లు ఇవ్వలేదు. ఎవరైనా స్థానిక అవసరాల పేరుతో ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవు. ఇసుక అక్రమ రవాణాపై సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం.
> – నగేశ్, కామారెడ్డి జిల్లా మైనింగ్ శాఖ అధికారి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

## కేసీఆర్ హయాంలోనే ఎక్కువ మంది రైతులకు లబ్ధి

- కాంగ్రెస్ ప్రభుత్వం కన్నా ఉమ్మడి జిల్లా రైతులకు రూ. వెయ్యి కోట్లు ఎక్కువ రుణమాఫీ
- రేవంత్ సర్కార్ అన్నిరకాల వడ్లకు బోనస్ ఇవ్వాలి
- హామీలు అమలుచేయకపోతే ప్రజలే అంతుచూస్తారు..
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

ఖలీల్‌వాడి, డిసెంబర్ 1: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ కన్నా సీఎం కేసీఆర్ హయాంలో రూ.వెయ్యి కోట్లు ఎక్కువగా రుణమాఫీ చేసినట్లు మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. రుణమాఫీ వందశాతం పూర్తయ్యిందని రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నాడని, దీంతో ఇక్కడి జిల్లా కాంగ్రెస్ నాయకులు రైతులను ఉద్ధరించామని జబ్బలు చరుచుకుంటున్నారని అన్నారు. కల్లబొల్లి మాటలు బంద్ చేసి రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏదైనా గ్రామానికి వెళ్లి రుణమాఫీ చేశామని మాట్లాడితే స్థానిక రైతులే వారి సంగతి చూసుకుంటారని అన్నారు. జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి (నిజామాబాద్, కామారెడ్డి) జిల్లాలో మొత్తం 3,79,520 మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు విడుతల్లో 2,01,967 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేసిందని తెలిపారు. ఇంకా 1,78,000 మంది రైతులకు రుణమాఫీ చేయాల్సి ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలో 2016, 2018లో రెండు విడుతల్లో కలిపి కేసీఆర్ ప్రభుత్వం లక్షలోపు రుణమాఫీ కోసం రూ.2,511 కోట్లు ఖర్చు చేస్తే .. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ కోసం చేసిన ఖర్చు రూ. 1,517 కోట్లు మాత్రమే అని వివరించారు.

### బోనస్ ఎగ్గొట్టేందుకే కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం

రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను సకాలంలో ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తమ ధాన్యాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకొని నష్టపోయారని తెలిపారు. చాలా మంది రైతులకు ప్రభుత్వం ఇస్తానన్న రూ.500 బోనస్ అందలేదన్నారు. బోనస్ ఇవ్వాల్సి వస్తుందన్న ఉద్దేశంతో కొనుగోలు కేంద్రాలు సకాలంలో ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాల్లోని రైతులు ముందుగానే పంట అమ్మేయడంతో వారికి బోనస్ రాలేదన్నారు. ఎన్నికల సమయంలో అన్ని రకాల వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు సన్నాలకు మాత్రమే ఇస్తామని చెప్పడం సరికాదన్నారు. జిల్లాలో 12 లక్షల మెట్రిక్ టన్నుల పంటవస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం 5 లక్షల మెట్రిక్ టన్నుల పంట మాత్రమే కొనుగోలు చేసిందని మండిపడ్డారు. మిగతా పంటను రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకున్నారని తెలిపారు. జిల్లాలోని రైతులందరికీ రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మాట ప్రకారం ప్రతి రైతుకూ ఎకరానికి ఎగ్గొట్టిన రూ.12 వేల బోనస్, రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతు భరోసాను ఎగ్గొట్టేందుకు కుట్రచేస్తున్నదని, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతుభరోసా ఎగ్గొడితే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. రైతుభరోసాను ఇవ్వకపోతే సర్కార్ కూలిపోవడం ఖాయమని, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం అంతు చూస్తారని హెచ్చరించారు.

### వేగంగా పడిపోతున్న సీఎం రేవంత్ గ్రాఫ్

అధికారం చేపట్టిన ఏడాదిలోనే దేశంలోనే అత్యంత వేగంగా గ్రాఫ్ పడిపోయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని సర్వేలు చెబుతున్నాయని వేముల తెలిపారు. ఆడలేక మద్దెల దరువు అనే రీతిలో వ్యవహరిస్తున్నాడని విమర్శించారు. మాయ మాటలు చెప్పి ఓట్లు దండుకుని, ఇప్పుడు ప్రజలను మోసం చేస్తున్నాడని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు, 13 హామీలు, 420 వాగ్దానాలు ఇచ్చి ఏ ఒక్క హామీ సక్రమంగా అమలు చేయలేదన్నారు. హామీలు అమలుచేయలేక కేసీఆర్ మీద పడి అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. చివరికి రేవంత్‌రెడ్డి పాలన బుడుబుక్కల, బుడ్డర్‌ఖాన్, బుల్డోజర్ పాలనగా మారిందన్నారు.

## టీయూకు మరో హాస్టల్ మంజూరు

- రూ.7 కోట్లు రూసా నిధులు కేటాయింపు
- తీరనున్న విద్యార్థినుల ఇబ్బందులు



డిచ్‌పల్లి, డిసెంబర్ 1 : తెలంగాణ యూనివర్సిటీలో విద్యార్థినుల ఇబ్బందులు తీరనున్నాయి. యూజీసీ సూచన మేరకు వర్సిటీలో మరో గర్ల్స్ హాస్టల్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు రూసా నిధులు రూ.7 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులు మే నెలలో మంజూరయ్యాయి. అప్పట్లో లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో టెండర్‌కు ఆటంకిగా మారింది. ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ, కాంట్రాక్టర్ అగ్రిమెంట్ పూర్తి కావడంతో త్వరలోనే నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. వర్సిటీకి నూతన వైస్ చాన్స్‌లర్‌గా టి. యాదగిరిరావు బాధ్యతలు చేపట్టి సుమారు నెల కావొస్తున్నది.

### యుజీసీ ఆదేశాల మేరకు..

యూనివర్సిటీలు, ఉన్నత విద్యా కళాశాలల్లో విద్యార్థినుల భద్రతపై నియమించిన యూజీసీ.. విద్యాసంస్థలు తీసుకోవాల్సిన చర్యలపై 2002 నవంబర్‌లో మార్గదర్శకాలు జారీ చేసింది. ముఖ్యంగా గర్ల్స్ హాస్టళ్లను ప్రస్తుత పరిస్థితులకనుగుణంగా నిర్మించాలని, క్యాంటీన్ మెస్ హాల్, పరిశుభ్రమైన టాయిలెట్లు, వాషింగ్‌మెషిన్లు, వైఫై సౌకర్యం, ఇండోర్ గేమ్స్, రీడింగ్ గదులు తదితర సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నది. విద్యార్థినులు ప్రవేశం పొందే సమయంలోనే హెల్ప్‌లైన్ నంబర్లు, స్టూడెంట్ కౌన్సిలర్లు, యాంటీ ర్యాగింగ్ సెల్, అత్యవసర వైద్యం, ఆరోగ్య కేంద్రం, క్యాంటీన్ తదితర పూర్తి వివరాలతో హ్యాండ్‌బుక్ ముద్రించి అందించాలని సూచించింది. బాలికల రక్షణకు అనుకూలమైన, సురక్షితమైన ప్రాంగణాలు తీర్చిదిద్దాలని కోరింది. విశ్వసనీయత ఉన్న సెక్యూరిటీ సంస్థల నుంచి తగినంత మహిళా భద్రతా సిబ్బందిని నియమించాలని పేర్కొంది. ఇలా మొత్తం 28 రకాల చర్యలు చేపట్టాలని యూజీసీ సూచించింది. యూజీసీ ఆదేశాల మేరకు ప్రస్తుతం వర్సిటీలో రెండో గర్ల్స్ హాస్టల్ నిర్మాణానికి మోక్షం లభించింది.



> **త్వరలోనే శంకుస్థాపన**
> తెలంగాణ యూనివర్సిటీకి మహిళా హాస్టల్ భవనం మంజూరైంది. ఇందుకు రూసా నిధులు విడుదలయ్యాయి. వీసీ యాదగిరి రావు హాస్టల్ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారు. త్వరలోనే హాస్టల్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తాం. హాస్టల్ నిర్మాణం పూర్తయితే విద్యార్థినులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది.
> – యాదగిరి, టీయూ రిజిస్ట్రార్

### ఒకే హాస్టల్‌తో ఇబ్బందులు..




తెలంగాణ యూనివర్సిటీ మెయిన్ క్యాంపస్‌లో 2008–09లో గర్ల్స్ హాస్టల్ ప్రారంభించారు. ప్రతి ఏటా పీజీ, ఇంటిగ్రేటెడ్ పీజీ, ఎల్ఎల్‌బీ కోర్సుల్లో బాలుర కన్నా అత్యధికంగా బాలికలే ప్రవేశాలు పొందుతున్నారు. బాలురకు రెండు హాస్టళ్లు ఉండగా.. బాలికలకు మాత్రం ఒకే హాస్టల్ ఉన్నది. దీంతో వారు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒక్కో గదిలో ఇద్దరు, ముగ్గురు విద్యార్థులను ఉంచాలి. కానీ గదుల కొరతతో ఒకే గదిలో ఆరుగురి నుంచి ఎనిమిది మంది విద్యార్థులు ఉంటున్నారు. పరీక్షల సమయంలో అయితే ఒక్కో గదిలో 10 మంది ఉంటున్న పరిస్థితి. టీయూలో మరో గర్ల్స్ హాస్టల్ నిర్మించాలని విద్యార్థినులతో పాటు వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఎన్నోసార్లు ఆందోళనలు, ధర్నాలు చేపట్టి, వినతిపత్రాలు అందజేశారు. ఎన్నో ఏండ్లుగా ఎదురుచూస్తున్న మరో గర్ల్స్ హాస్టల్ నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం లభించడంతో విద్యార్థినులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.